క్లుప్తంగా

గరుడ వాహనంపై వెంకన్న



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం గరుడ వాహనంపై వెంకన్న పురవీధుల్లో విహరించారు. ఆలయంలో స్వామికి అర్చకులు గోవర్ధన్ భట్టార్ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వాహనంలో స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో కృత్తిక దీపం



కృత్తిక నక్షత్ర దీపాన్ని వెలిగించిన భక్తులు

కలకడ : మండలంలోని కోన పంచాయతీ పాతకోన శివాలయంలో కృత్తిక నక్షత్ర దీపాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ విశ్వనాథ ఆధ్వర్యంలో వెలిగించారు. ఏడాదికి ఒక్కసారి అత్యంత భక్తి శ్రద్ధలతో వెలిగించే ఈ కృత్తిక నక్షత్ర దివ్వదీపారాధను పవిత్ర అరుణాచలేశ్వర స్వామి, పురాతన చరిత్ర కలిగిన ఆలయాలలో మాత్రమే వెలిగిస్తారని విశ్వనాథ తెలిపారు. అనంతరం ఆలయానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు వేతనాలు

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు లేబర్ కమిషనర్ 23 నెలల వేతనాలు మంజూరు చేశారని మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ ఎఫ్–100 ప్రెసిడెంట్ జే.వి.నరసింహమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2014లో మిల్లు యాజమాన్యం కార్మికులకు తెలపకుండా మిల్లును మూసివేసిందన్నారు. స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు రావాల్సిన బకాయిల విషయమై యూనియన్ చేసిన పోరాటాలకు ఎట్టకేలకు కదలిక వచ్చిందన్నారు. ఇల్లీగల్ లాకౌట్‌కు సంబంధించి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను విజయవాడ లేబర్ కమిషనర్ మంజూరుచేశారని తెలిపారు.

ఆధిపత్య పోరుతో అభివృద్ధి పనులకు ఆటంకం

ఓబులవారిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆధిపత్య పోరుతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య అన్నారు. వైకోట గ్రామంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలలు గడచినా జనసేన, టీడీపీ నాయకుల మధ్య వివాదంతో పనులు జరగడం లేదన్నారు. వైకోట– గుండాల కోన రహదారి పనులు నిలిచిపోయాయని, ఈ నెల 20వ తేదీలోగా ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మెద్దుల వేంకటరమణ, కడియాల చిన్నయ్య, మేకల మురళి, బిగాల సుధా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యేనా?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగు పీహెచ్‌సీలు మంజూరు
- పనులకు రూ.11.6 కోట్ల నిధులు మంజూరు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న ప్రజలు



కందుకూరు పీహెచ్‌సీ

బి.కొత్తకోట: వైద్యాన్ని అందరికి అందుబాటులోకి తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా లేదా అని గ్రామీణులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం వైద్యసేవల్లో వినూత్న మార్పులు తీసుకొచ్చి గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో ఒకేసారి 176 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. ఇందులో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 21 కేంద్రాలను కేటాయించింది. వీటిలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి మూడు, మదనపల్లె నియోజకవర్గానికి ఒక పీహెచ్‌సీని కేటాయించారు. ఇందులో భవనాలు, వసతులు, సౌకర్యాల కోసం నిధులు కేటాయించి మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంజూరైన పీహెచ్‌సీల పనులు చేపట్టి పూర్తి చేసి గ్రామీణులకు వైద్య సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెలకు పీహెచ్‌సీలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట మండలం కడపత్రాస్, మొలకలచెరువు మండలం బురకాయలకోట, పెద్దమండ్యం మండలం కలిచర్ల, మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం దేవిటివనపల్లెకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. ఈ పీహెచ్‌సీలు ఏర్పాటయ్యే ప్రాంతాలన్నీ గ్రామాలే. ఇక్కడ పీహెచ్‌సీల ఏర్పాటు అవసరాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

పీహెచ్‌సీకి రూ.2.9 కోట్లు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విశాలమైన ప్రాంగణంలో నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో పీహెచ్‌సీ కోసం 1.5 ఎకరాలను సేకరించాలి. అందులో భవనాలు, నీరు, విద్యుత్, ఇంటర్నెట్, రోడ్ల సౌకర్యం కల్పించాలి. పీహెచ్‌సీలను నివాస పల్లెలకు అందుబాటులో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించాలి. పల్లెలకు దూరంగా ఉండి అసౌకర్యం కలగకూడదు. నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారులతో భూమి సేకరణ చర్యలు సత్వరమే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఒక్కో పీహెచ్‌సీ నిర్మాణానికి రూ.2.9 కోట్ల కేటాయించారు. ఈ నిధులు సరిపోకపోతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు గత ప్రభుత్వం సుముఖతను కూడా వ్యక్తం చేసింది. వీటితో వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగి రోగులకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. వ్యయ ప్రయాసలు తప్పుతాయి. ఇప్పటికే మండలానికో పీహెచ్‌సీ ఉండగా ఇవి అదనం.

కామినేనిది ఉత్తుత్తి హామీ

గత టీడీపీ ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన కామినేని శ్రీనివాస్ మొలకలచెరువు మండలం బురకాయలకోటలో పర్యటించారు. స్థానిక పాడుబడిన సబ్‌సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు వైద్యసేవలు విస్తరించాలని, బురకాయలకోటకు పీహెచ్‌సీని మంజూరు చేయాలని విన్నవించగా కామినేని హామీ ఇచ్చి వెళ్లారు. తర్వాత ఐదేళ్లకు కూడా మంజూరు చేయలేదు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బురకాయలకోటకు పీహెచ్‌సీని మంజూరు చేయించారు. అంతేకాక కందుకూరు, కోసువారిపల్లె, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, కురబలకోట, పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.2.30 కోట్లు మంజూరు చేయించి ఆధునీకరించారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



మున్సిపాలిటీ ఎదుట సమ్మె చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

మదనపల్లె : మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో సుమారు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నప్పటికీ, ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు ప్రభుత్వాలు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చలేదన్నారు. పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ, ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు డిసెంబర్ 8 అర్ధరాత్రి నుంచి సమ్మె చేస్తున్నామన్నారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. టెక్నికల్, నాన్‌టెక్నికల్‌కు రూ.29,200– రూ.24,500 ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు ఇస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంఎస్.కన్నయ్య, బి.రత్నకుమార్, ఎస్.నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సాంబశివ తదితరులు

మదనపల్లె : కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.సాంబశివ తెలిపారు. అన్నమయ్యజిల్లా కేంద్రం రాయచోటిలో డిసెంబర్ 20వ తేదీన జరగనున్న ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫలమైందన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల పాల్గొన్నారు.

చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్గంధం



మాధవరం–1 పంచాయతీలో చెత్తాచెదారం

సిద్ధవటం: మండలంలోని మాధవరం–1 పంచాయతీలో చెత్తా, చెదారం పేరుకు పోయింది. రోడ్డు నెంబర్–13లోని పాత పంచాయతీ కార్యాలయం వెనుక, భద్రావతి భావనారాయణస్వామి ఆలయ ఆవరణంలో చెత్త తొలగించకపోవడంతో కంపు కొడుతోంది. దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జనం ఆందోళన చెందుతున్నారు. చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామోత్సవంలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. గ్రామోత్సవం సొసైటీ కాలనీ, పటేల్‌రోడ్డు, సీటీఎం రోడ్డు, నెహ్రూబజార్, బెంగళూరు బస్టాండు మీదుగా ఆలయం వరకు సాగింది. అయ్యప్పమాలాధారులు, కళాకారులు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. స్వామిని దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూరహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. హెల్పింగ్ మైండ్స్ సంస్థ అయ్యప్పమాలాధారులకు నిమ్మరసం అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు మార్పూరి సుధాకర్‌నాయుడు, విజయలక్ష్మి భాస్కర్, జర్మన్‌రాజు, భగవాన్, బాలకృష్ణ, కేశవ, ఆంజనేయులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం

ములకలచెరువు: మండలంలోని వేపూరికోట పంచాయతీ చీకుచెట్టుపల్లెకు చెందిన బయ్యారెడ్డి (42) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పిల్లల చదువు కోసం సహాయం చేస్తానని ఆయన తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 125 కేసులు పరిష్కారం



కేసు విచారిస్తున్న ఇన్‌చార్జి న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 125 కేసులు పరిష్కరించినట్లు జిల్లా 11వ అదనపు జడ్జి ఎస్. రమేష్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 125 కేసులు పరిష్కరించడంతో పాటు రూ.68,56,262 నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, ఇన్‌చార్జి న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి అధ్యక్షతన మెగా లోక్ అదాలత్ జరిగింది. సీసీ (ఐపీసీ) సంబంధించిన కేసులు 20, సీసీ (అడ్మిషన్) కేసులు 6, ఎస్‌పీసీ (అడ్మిషన్) 62, సీసీ ఎక్సైజు కేసులు 20, ఓఎస్ ప్రార్టిషన్ 4, ఓఎస్ (పీఐ) రెండు కేసులు పరిష్కరించి రూ.3,59,545 ఫైన్ వసూలు చేసినట్లు తెలిపారు. ఈపీ ఒక కేసు రూ.2,21,686తో సెటిల్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రామచంద్ర, పోలీసులు, లోక్‌అదాలత్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

కలికిరి (వాల్మీకిపురం): జాతీయ లోక్ అదాలత్ కార్యాక్రమంలో భాగంగా వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి గురు అరవింద్ 144 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు మోడెం రవిప్రకాష్, యల్లారెడ్డి, ద్వారకనాథరెడ్డి, పాల్‌రెడ్డి, ఆర్వీ ప్రసాద్, కరీముల్లా, రమణారెడ్డి, జి.రమణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : సీఎం సహాయ నిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సీఎం సహాయనిధి కోసం దరఖాస్తుచేసుకున్న పలువురికి శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా రూ.20లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ రకాలకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు అందకున్న వారిలో ప్రభావతి, హర్షవర్ధన్, సహదేవరెడ్డి, రేవంత్, అంజమ్మ, రహీమున్నీసా తదితరులు ఉన్నారు.

అవగాహన తప్పనిసరి

ప్రతి ఒక్కరికీ ఇంధనం పొదుపుపై అవగాహన తప్పనిసరి అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ రూపొందించిన జాతీయ ఇందన వారోత్సవాల పోస్టర్‌నుఆవిష్కరించారు.ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఈఈ హరికుమార్ పాల్గొన్నారు.

తరిగొండ ఆలయంలో పూజలు



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అపోహలు వీడేలా.. చెల్లుబాటయ్యేలా..!

పది నాణెంపై బ్యాంకు సిబ్బంది ప్రచారం



మదనపల్లె సిటీ: పది రూపాయల నాణెం చెల్లుబాటుపై ప్రజల్లో అపోహను తొలగించి వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అటు దుకాణదారులు, ఇటు వినియోగదారులకు నమ్మకాన్ని కలిగించి వాటి చలామణి పెంచేందుకు వీలుగా ప్రచారాన్ని ప్రారంభించింది. జిల్లాలో ఇండియన్ బ్యాంకు సహకారంతో నాణేల చట్టబద్ధతపై విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది.

చిల్లర డబ్బుల కొరత

చిల్లర డబ్బుల చలామణి కూరగాయల మార్కెట్లు, చిన్న హోటళ్లు, చిల్లర దుకాణాల్లో ఎక్కువ కొనసాగుతుంటాయి. పది రూపాయల నాణేల చెల్లుబాటు కాదనే అపోహ ప్రజల్లో ప్రచారం కావడం వలన నాణేలను తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చిరిగిన, నలిగిపోయిన నోట్లు తీసుకుంటున్నారు తప్పా.. వీటిని తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. దీంతో మార్కెట్లో చిల్లర డబ్బుల కొరత తీవ్రంగా మారింది.

ఇదీ సమస్య

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా పది రూపాయల నాణేలను 2005లో తొలిసారిగా ముద్రించింది. 2019 వరకు ఆయా సందర్భాలను బట్టి 14 సార్లు ఇవి విడుదలయ్యాయి. అన్ని రకాల నాణేల చెల్లుబాటులో అవుతాయని రిజర్వు బ్యాంకు పలుమార్లు స్పష్టం చేసినా వాటి చలామణి దాదాపు నిలిచిపోయింది. అవగాహన ఉన్న కొందరు వాటిని వాడుదామనుకున్నా ఎదుటి వ్యక్తులు వాటిని తీసుకోవడానికి నిరాకరించడంతో బహిరంగ మార్కెట్‌లో వాడకం నిలిచిపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిజర్వు బ్యాంకు పది రూపాయల నాణేలు ముద్రిస్తున్నా వాటి చలామణి నిలిచిపోవడంతో సమస్యగా మారింది.

చర్యలు తప్పవు

పది రూపాయల నాణేలు చెల్లుబాటు కావనేది అపోహ మాత్రమే. గతంలో పలుమార్లు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నాణేల చట్టబద్ధతపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఎవరైనా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

–హరినాథ్, బ్రాంచి మేనేజర్, ఇండియన్ బ్యాంకు, తంబళ్లపల్లె

నాటకీయంగా సాగునీటి సంఘం ఎన్నిక



నిరసన తెలుపుతున్న రైతులు

నిమ్మనపల్లె : బహుదా సాగునీటి సంఘం ఎన్నికలో నాటకీయ పరిణామాల చోటుచేసుకున్నాయి. ఆరు టీసీలు ఉండగా, టీసీ –1లో సభ్యులుగా కొండయ్య గారి పల్లెకు చెందిన కూరపర్తి భాస్కర్‌రెడ్డి, దిగువపల్లికు చెందిన బి. రెడ్డప్ప, రామ పోటీ పడ్డారు. అందులో 114 మంది కూరపర్తి భాస్కర్ రెడ్డికి మద్దతుగా చేతులు పైకి ఎత్తడంతో, టీసీ–1 సభ్యులుగా ఎన్నికైనట్లు అధికారి ప్రకటించారు. అయితే టీసీ– 2 లో దేవళం కురవపల్లికు చెందిన లోకనాథం నామినేషన్, సమయానికి వచ్చిన తీసుకోలేదంటూ, ఎమ్మెల్యే వర్గీయులైన తవళం రాజన్న, శ్రీపతి, ముష్టూరు మాజీ సర్పంచ్ రమణ,రెడ్డప్ప, రఫీ, తదితరులు టీసీ–1 పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నిక నిలిపివేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ వారికి వివరణ ఇవ్వడంతో వారు బయటకు వెళ్లిపోయారు. బహుద ప్రాజెక్టు సాగునీటి సంఘం చైర్మన్ గా ఎన్నిక అయ్యేందుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బి.రెడ్డప్పకు మద్దతు పలికారు. అయితే ఆయన టీసీ సభ్యులుగా ఎన్నిక కాకపోవడంతో, ఎమ్మెల్యే అసమ్మతి వర్గం మద్దతుదారులతో బరిలో నిలిచిన కూరపర్తి భాస్కర్‌రెడ్డి చైర్మన్ అవుతారని అంతా భావించారు. అయితే మధ్యాహ్నం మూడు గంటలకు జరిగిన అధ్యక్ష ఉపాధ్యక్ష ఎన్నికల సమయంలో, అత్యంత నాటకీయంగా, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, అగ్రహారం పంచాయతీ చింతపర్తి వారి పల్లెకు చెందిన కె. దేవేందర్‌రెడ్డికి మద్దతు పలికారు. అంతేకాకుండా మూడు టీసీ సభ్యులైన వాల్మీకిపురం మండల వాసులు, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి సూచనతో దేవేందర్ రెడ్డికి మద్దతు పలకడంతో, ఏకగ్రీవంగా ఆయన అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

టీడీపీలో వర్గపోరు

మదనపల్లె : ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు అధికార పార్టీ నాయకుల జోక్యంతో ఏకపక్షంగా జరిగాయి. ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సి ఉండగా, సంఘాల్లో కేవలం టీడీపీకి చెందిన వారే ఉండాలనే లక్ష్యంతో పావులు కదిపి అధికారులను రంగంలోకి దింపి, ఏకపక్షంగా ఎన్నికలు జరిపించుకున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో 15 చెరువులు, 1 బహుదా ప్రాజెక్ట్‌కు జరిగిన ఎన్నికల్లో ఒకచోట తప్ప మిగిలిన అన్నింటిలోనూ సింగిల్ నామినేషన్లు వేయించి తాము ప్రతిపాదించిన అభ్యర్థులనే నీటిసంఘం అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యేలా చూశారు. అయితే నిమ్మనపల్లె మండలంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు, టీడీపీకి చెందిన వ్యతిరేకవర్గం చెక్ పెట్టింది. ఎమ్మెల్యే బలపరిచిన అభ్యర్థి బి.రెడ్డెప్పకు ఒక ఓటు రాలేదు. టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు బలపరచిన అభ్యర్థి కూరపర్తి భాస్కర్ రెడ్డికి 114 మంది మద్దతు లభించింది. దీంతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పరువు దక్కించుకునేందుకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో బహుదా ప్రాజెక్ట్ చైర్మన్‌గా చింతపర్తివారిపల్లెకు చెందిన దేవేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేయించుకున్నారు.

ఆయుకట్టుదారుల నిరసన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని ఏడు ప్రధాన చెరువులకు సంభంధించి శనివారం ఎన్నికలు నిర్వహించారు. టి.సదుం పంచాయతి తుమ్మల చెరువుకు సంభందించిన పలువురు ఆయుకట్టుదారులు చెరువు కట్ట, తూము వద్ద వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. తాను నామినేషన్ వేసేందుకు మద్దతుదారులతో కలసి వెళితే అధికారులు తిరస్కరించారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీతారామచంద్రా రెడ్డి అనే రైతుతో పాటు పలువురు ఆరోపించారు. మిగిలిన పలుచోట్ల చాటింపు వేయలేదని, నామినేషన్లు తిరస్కరించారని, తమకు సమాచారం ఇవ్వలేదనే కారణాలతో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు నెలకొంది. ఎట్టకేలకు మంతనాలు, బుజ్జగింపులతో నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం చేశారు.

పారదర్శకత లేని నీటి సంఘ ఎన్నికలు

బి.కొత్తకోట: సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణపై శనివారం సాక్షిలో ప్రచురితమైన 'పారదర్శకత లేని నీటి సంఘ ఎన్నికలు' కథనం అక్షర సత్యమైంది. ఈ ఎన్నికల్లో వ్యవసాయం చేసే రైతుల పాత్ర లేకుండాపోయింది. టీడీపీకి మద్దతుగా ఉన్న కొద్ది మంది రైతులతో నామినేషన్లు వేయించి ఎన్నికల తతంగాన్ని మమ అనిపించి పూర్తి చేశారు. బి.కొత్తకోట మండలంలో బి.కొత్తకోట, బడికాయలపల్లె, గుమ్మసముద్రం, గట్టు, బయ్యప్పగారిపల్లె చెరువుల సంఘాలకు ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లలో ఎన్నికలకు ఉదయం ఏర్పాట్లు చేసారు. ఎన్నికల సిబ్బంది వచ్చాక పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా అతికించారు. అంత వరకు జాబితా ఎవరికి తెలియదు. ఒక్కో సంఘానికి ఆరుగురు సభ్యులు ఎన్నిక కావాల్సి ఉండటంతో ముందుగా ఎంపిక చేసుకున్న టీడీపీ మద్దతుదారులైన రైతులను కేంద్రాల వద్దకు తీసుకొచ్చారు. వారితో నామినేషన్లు వేయించారు. ఒక్క నామినేషన్ కూడా అదనంగా వేసే అవకాశం లేకుండా చేశారు. ఏకగ్రీవం అంటూ ఎన్నికలు పూర్తి చేసి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తి చేసి మమ అనిపించేశారు.

రసవత్తరంగా ఎన్నికలు

పెద్దమండ్యం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. పెద్దమండ్యం గ్రామ పరిధిలోని లంపవంకచెరువుకు ఉన్నత పాఠశాల వద్ద జరిగిన ఎన్నికల్లో టీడీపీ నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కాగా ఈ చెరువు కింద ఆయకట్టుదారులు రామానాయక్ తండాకు చెందిన గిరిజనులు ఎక్కువ మంది ఉన్నారు. ఈ క్రమంలో తండాకు చెందిన గిరిజన నాయకుడు ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఆరు టీసీలకు గాను ఐదు టీసీలకు నామినేషన్‌లు వేయడంతో ఎన్నిక ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. లంపవంకచెరువు సాగునీటి సంఘం చైర్మన్‌గా చలపతినాయుడు ఎన్నికయ్యారు.

ఏకగ్రీవంగా నీటి సంఘం ఎన్నికలు

కురబలకోట: కురబలకోట మండలంలోని అంగళ్లు (మల్లేశ్వరం) చెరువు నీటి సంఘం చైర్మన్‌గా మలిపెద్దివారిపల్లె పోరెడ్డి రమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా ముదివేడు పెద్ద చెరువు నీటి సంఘం చైర్మన్‌గా బీదం మల్లయ్యను ఎన్నుకున్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని 11 చెరువు సాగు నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల నిర్వాహణాధికారులు సురేష్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ హరికుమార్ తెలిపారు.

కలికిరి: మండలంలోని గుండ్లూరు భయ్యపురెడ్డి చెరువు, కలికిరి పెద్దచెరువుల నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి.

రామసముద్రం: మండలంలోని సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మాలేనత్తం పంచాయతీ ఉప్పినెల్లి చెరువు చైర్మన్‌గా ఎం.సుధాకర్ రెడ్డి, కాప్పల్లె చెరువు నీటి సంఘం చైర్మన్‌గా సుబ్రహ్మణ్యం రాజు, పెద్దకురప్పల్లె పంచాయతీ సందూరి చెరువు చైర్మన్‌గా శంకర్ రెడ్డి, చొక్కాండ్లపల్లె పంచాయతీ కనగాని చెరువు చైర్మన్‌గా ఆర్.కృష్ణా రెడ్డి ఎన్నికయ్యారు.

రైతుల నిరసన

కాప్పల్లె పంచాయతీలో శనివారం జరిగిన పాయ చెరువు ఎన్నికల్లో అధికారుల పనితీరుపై రైతులు ఆందోళన చేపట్టారు. ఓటర్ల జాబితాలో ఆయకట్టు రైతుల పేర్లను తొలగించారని, దీనిపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో విన్నవిస్తే.. ఎన్నికల స్థలంలోనే శిస్తులు కట్టించుకుంటామని చెప్పారని తెలిపారు. అయితే ఎన్నికల స్థలంలో అధికారులు ఇదిగో...అదిగో అంటూ తమ సమయం వృథా చేసి చివరికి సమయం మించిపోయిందని తమను బయటకు పంపేశారని వాపోయారు.

ములకలచెరువు: మండల వ్యాప్తంగా శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 8 చెరువులకు సాగునీటి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు తహసీల్దార్ ప్రదీప్ తెలిపారు.